# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు.**

2. **శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని హోం మంత్రి వి. అనిత తెలిపారు.**

3. **పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తూ ప్రోత్సాహకాలను అందిస్తోందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

4. **ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన, క్రీడా వారోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ లకు నిన్న లేఖలు రాశారు. జీఎస్టీ, ఎక్సైజ్ సుంకం పెంపుతో పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. పెరిగిన పన్నుల ప్రభావంతో మార్కెట్‌లో కొనుగోళ్లు మందగించాయన్నారు. కొనుగోలు సంస్థలు పరిమాణాన్ని తగ్గించుకోవడంతో రైతులకు నష్టం జరుగుతోందని, దాదాపు 43 వేల మంది రైతులు, లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రభావితమవుతోందని వెల్లడించారు. పెరిగిన పన్నుల విధానాన్ని పునఃసమీక్షించి, పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కోరారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో శాంతిభద్రతలకు ప్రాధాన్యమిస్తూ పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని హోం మంత్రి వి. అనిత తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాకం లోని వర సిద్ధి వినాయక స్వామి దేవస్థానాన్ని కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నిన్న దర్శించుకున్నారు. మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30..సెకన్లు

-------------------------

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్రం నిధులు విడుదల చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కొనుగోళ్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సన్న వడ్లకు అదనపు నగదు చెల్లించడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ మంత్రులు జిల్లాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తూ ప్రోత్సాహకాలను అందిస్తోందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు నెల్లూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఆత్మకూరు బస్టాండు వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సంపద సృష్టి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి తీసుకొచ్చామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25...సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జున్నూరు, వేడంగి, మట్టపర్రు గ్రామాల్లో 3 కోట్ల 76 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు తాగునీరు, సాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గత రెండేళ్లలో 20 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడుల కోసం 117 అవగాహన ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా లక్షా 22 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో హోటళ్లు, క్యారవాన్ టూరిజం, హౌస్ బోట్లు, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యక్రమాలను విస్తరిస్తున్నామని చెప్పారు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవం, విజయవాడ ఉత్సవ్, అరకు చలి ఉత్సవ్ వంటి కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోందన్నారు.గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

---------------------------

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన, క్రీడా వారోత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయి. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈరోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ హాజరై వారోత్సవాలలో పాల్గొంటారు. ప్రారంభ వేడుకల్లో భాగంగా ఐదు కిలోమీటర్ల వాకథాన్ నిర్వహించనుండగా, యోగ, ధ్యాన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. పెద్ద సంఖ్యలో యువత, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో

పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కూడా క్రీడా పోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ యువజన, క్రీడా వారోత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

---------------------------

విద్యతో పాటు రాజకీయ రంగంలో కూడా యువత ముందుకు రావాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బి.నాగరాజు అన్నారు. కర్నూలులో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిన్న సత్కరించారు. విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ " కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్ర పుణెలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా వారు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంను నిన్న సందర్శించారు. ఈరోజు విద్యార్థులు రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేలా దేవాలయాల సందర్శనతో పాటు, పరిశ్రమల అభివృద్ధి, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం వంటి ప్రదేశాలను సందర్శించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

---------------------------

ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఎలక్ట్రిక్ బైక్‌పై పర్యటించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఎలక్ట్రిక్ వాహనం నడుపుతూ పలు కార్యక్రమాల్లో నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన వనరులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు ఇంధన పొదుపును అలవాటు చేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత పెరుగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మార్కాపురం జిల్లాలోని కంభంలో నిన్న అత్యధికంగా 43.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలోని 14 జిల్లాల పరిధిలోని 65 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది.

రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఈ రోజు 42 నుంచి 44 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, వడగాలులు కూడా వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రొయ్యల మేత ధరలు పెరగడంపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు నిన్న లేఖ రాశారు. 2026 జనవరి నుంచి మే మధ్య కాలంలో సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకుల ధరలు 20 శాతానికి పైగా పెరిగాయని, దీంతో మేత తయారీ ఖర్చు కిలోకు 31 రూపాయాలకి పైగా పెరిగిందని లేఖలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఫిష్ మీల్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సోయా దిగుమతులపై ఆంక్షలు సడలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

======================